# ఎన్నికల విధుల్లో పోలింగ్ ప్రక్రియ కీలకం

**డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్**

**ముగిసిన ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం**




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్, చిత్రంలో జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 28 : ఎన్నికల విధులను అధికారులు సక్రమంగా నిర్వర్తించాలని.. ఈ విధుల్లో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని డిప్యూటీ కలెక్టర్ శివ కుమార్ అన్నారు. పోలింగ్ డే సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా పోలింగ్ స్టేషన్లను పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకోవాలన్నారు. శనివారం సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవితో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. షేక్‌పేట్ నారా యణమ్మ కళాశాలలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌కు చేపట్టిన ఈ రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ డే సందర్భంగా ఎన్నికల సిబ్బందితో ఉదయం 5.30 గంటలలోపు మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎన్నికల చివరి అంకంలో ఎవరికి కేటాయించిన విధులను వారు నిర్వర్తించాలని.. అంతేకాక ఇతరుల విధుల్లో జోక్యం చేసుకోరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్.. పీఓ, ఏపీఓలతో పాటు 800 మంది ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈఆర్ఓ సేవా ఎస్లావత్, ఏఈఆర్ఓ లు.. ఏసీపీ రాణి, ఏఎంసీలు బాల్‌రాజ్, కమల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్‌ల చోరీ.. నిందితుడు అరెస్టు



నిందితుడు మహ్మద్‌అలీమ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 28: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను తస్కరించి తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను బోరబండ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ భూపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అలీమ్ ప్రైవేటు ఉద్యోగి. జల్సాలకు అలవాటుపడి వాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. అలీమ్‌పై నిఘా పెట్టిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బైక్‌ల చోరీ బయటపడింది. అతని వద్ద నుంచి బజాజ్ ప్లాటినా, యమహా, హోండా ట్విస్టర్ మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## యువతికి వేధింపులు.. కేసు నమోదు

వెంగళరావునగర్, అక్టోబర్ 28 : యువతిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామ్‌ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం..ఫిరోజ్‌గూడ ప్రాంతానికి చెందిన యువతి ఎస్ఆర్ నగర్ లోని ఓ బ్యాంకులో పని చేస్తుంది. ఈమెకు అల్వాల్‌కు చెందిన అజయ్ కుమార్(22)తో పరిచయం ఉంది. కాగా.. ఇటీవల సదరు యువతిని తరచూ వేధించసాగాడు. అలాగే.. యువతి పనిచేస్తున్న బ్యాంకు వద్దకు వచ్చి గొడవకు దిగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా డాన్‌బాస్కో కళాశాల గ్రాడ్యుయేషన్ డే...

ఎర్రగడ్డ, అక్టోబర్ 28 : ఎర్రగడ్డలోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓయూ ప్రొఫెసర్ అంజలాడేవిడ్ విచ్చేసి 2020-2023 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.



ప్రచారంలో భాగంగా షేక్‌పేట్‌లో పాదయాత్ర చేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, నేతలు



బోరబండ మధురానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# ముమ్మరంగా ప్రచారం..

**షేక్‌పేట్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాగంటి పాదయాత్ర..**

షేక్‌పేట్, అక్టోబర్ 28 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఇందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే మాగంటి షేక్‌పేట్ డివిజన్‌లో పాదయాత్రను విస్తృతంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్‌కుమార్ ,ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

***బోరబండ డివిజన్‌లో..***

ఎర్రగడ్డ, అక్టోబర్ 28: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ తరపున బస్తీల్లో ప్రచారం ముమ్మరంగా కొన సాగుతున్నది. బస్తీల వారీగా గులాబీ సేన ఇంటింటికి వెళ్లి ప్రచారంలో పాల్గొంటున్నారు. బోరబండ డివిజన్, మధురానగర్‌లో శనివారం నిర్వహించిన ప్రచారానికి మైనార్టీలు సహా అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మధురానర్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ నేతృత్వంలో పలువురు ప్రచారంలో పాల్గొని.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాగంటి గోపినాథ్ చేసిన అభివృద్ధి పనుల గురించి స్థానికులకు వివరించారు. మెరుగైన మౌలిక సదుపాయాలు సహా ఆధునిక కమ్యూనిటీహాళ్ల నిర్మాణం పూర్తయిన అంశాలను ప్రజల ముందుంచారు. దశాబ్దాల చరిత్ర ఉన్న బోరబండను బంగారు బండగా తీర్చిదిద్దిన మాగంటిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాయ మాటలుచెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తు న్న పార్టీలకు తగు విధంగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రచారంలో నాయకులు నరసింహాగౌడ్, సయ్యద్ ఖాజా, ఎండీ హనీఫ్, తిరుపతయ్య, యాదయ్య, దేవేందర్, సందీప్, అభిషేక్, అల్తాఫ్, ఎం.నరసింహ, బాలాజీ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు..



ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ బీ బ్లాక్‌లో కలుషితనీటి నివారణకు చేపడుతున్న పనుల ను శనివారం జలమండలి జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ శ్రీహరి పరిశీలించారు. తాగునీటి సరఫరాలో కలుషితనీరు కలువకుండా పనులు చేపడుతున్నామన్నారు. లో ప్రెషర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

*- జూబ్లీహిల్స్, అక్టోబర్ 28*

## ముమ్మరంగా రోడ్ల అభివృద్ధి పనులు..



యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ముమ్మరంగా రోడ్ల పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎల్ఎన్ నగర్ పీజేఆర్ ప్లే గ్రౌండ్‌లో రూ.26 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఈఈ రాజ్‌కుమార్ ఆదేశాలతో న్యాక్ ఏఈ వెంకటేశ్ పరిశీలించారు. *- జూబ్లీహిల్స్*

## పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి చేరిక

**ఎమ్మెల్యే మాగంటి సమక్షంలో పార్టీలో చేరిన ఎంఐఎం కార్యకర్తలు**



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

బంజారాహిల్స్, అక్టోబర్ 28: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్‌కు చెందిన 30మంది ఎంఐఎం కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో మైనార్టీలు బీఆర్ఎస్‌ను మద్దతు పలుకుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన షేక్ జావిద్, సయ్యద్ నజీర్, ఎండీ మసూద్, ఎండీ గౌస్, అశ్వాక్ ఖాన్,అర్షద్ ఖాన్, మాజిద్, సయ్యద్, ఉమర్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతాం

**వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్**



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్

వెంగళరావునగర్, అక్టోబర్ 28: ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నామని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ అన్నారు. శనివారం సాయంత్రం మధురానగర్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రౌడీషీటర్ల కార్యకలాపాలపై గట్టి నిఘాను ఉంచామని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా రౌడీలపై నిఘా పెట్టాలని ఈసీ ఆదేశించిందని పేర్కొన్నారు. ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్లారెడ్డిగూడలో రౌడీషీటర్ గువ్వల పవన్‌కుమార్ అలియాస్ బిల్లా పవన్ ఓ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంటిని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడని..గంజాయి కూడా విక్రయిస్తున్నాడని..రౌడీషీటర్ బిల్లా పవన్‌పై కేసులు నమోదు చేసి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. రౌడీల అరాచకాలను సహించబోమని..రౌడీలు ఎవరైనా బెదిరిపులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలని..రౌడీలకు భయపడొద్దని నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు. రౌడీల చట్టవ్యతిరేక కార్యకలాపాల పై సమాచారం ఉంటే మౌఖికంగా కూడా ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు ఆయన సూచించారు. మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచామని..రౌడీయిజాన్ని అణచివేస్తామన్నారు. ఈ సమావేశంలో పంజగుట్ట ఏసీపీ ఎస్.మోహన్ కుమార్. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, డీఐ బి.రవికుమార్ పాల్గొన్నారు.